రెప్పలు లేని కళ్ళు

(Open Eyelids)

జైలు....

'నిన్న' ..... కు

'నేడు' ..... కు

'రేపు' ..... కు వ్యత్యాసంలేని జైలు. వారం పేరుతో గానీ, తారీఖుతో గానీ నిమిత్తం లేని కారాగారం. ఘనీభవించిన కన్నీళ్ళకు, గడ్డకట్టుకుపోయిన కాలానికి నిలయమైన ప్రిజన్. 'లా క ప్పు' ల వెనుక నిద్రపట్టని రాత్రిళ్ళు. లాకప్పుల బయట అర్థవిహీనమైన పవళ్ళు. ఉదయాస్తమయాల రెక్కలపై ఎగిరివెళ్ళే సూర్యుడు-జైలు తూర్పు వైపు గోపురంపై ఉదయించటం - ఎత్తయిన ప్రహరీ గోడ ముళ్ళ తీగె వెనుక అస్తమించటం - మినహా మార్పులేని రోజులు.

జైలులో ఒక భాగం - శిక్షలు పడిన ఖైదీలు.

.... రెండవ భాగం - శిక్షలు పడని ఖైదలు... వీళ్ళు నేరారోపణలేని ఖైదీలు - నేర విచారణ లేని నేరస్థులు. తమ నిర్బంధానికి కారణం అడిగే హక్కు లేని నిర్భాగ్యులు. బెయిల్‌పై విడుదలయ్యే అర్హతలేని నిస్పహాయులు. డిటెన్యూలు -

వీళ్ళు.... విద్యార్థులు - విప్లవ మేధావులు - అధ్యాపకులు - ఉపాధ్యాయులు-కవులూ-కళాశాలలు-శాసనసభ్యులు-పెద్ద పెద్ద నాయకులు - చిన్న చిన్న కార్యకర్తలు, మొదలగువాళ్ళు. వెలుగు కోసం నిరీక్షిస్తూ సంవత్సరాలతరబడిగా చీకటిలో మ్రగ్గిపోతున్నారు.

ఆరోజు... మధ్యాహ్నం - రెండు గంటలు.

డైనింగ్ హాలులో ఇద్దరు డిటెన్యూలు ఎదురుతిరిగుతూన్న కాలాన్ని లొంగతీసుకొనే ప్రయత్నంలో ఉన్నారు. ఒకరు కుర్చీలో కూర్చొని ఉన్నాడు. అతను టేబుల్‌పై 'హిందూ' ఇంగ్లీషు పత్రిక పరచుకొని ఏకాగ్రతతో చదువుతున్నాడు. రెండవవ్యక్తి కొద్ది దూరంలో గచ్చునేలపై కూర్చొని పలకపై వ్రాసుకొంటున్నాడు.

బయట ఎండ చిటపటలాడుతోంది.

ఆస్‌బెస్టాస్ రేకుల క్రింద చొక్కాలు లేని వాళ్ళు శరీరాలు చెమటతో చిటచిటలాడుతున్నాయి.

'సూండండి.... ఏమైనా తప్పులున్నాయేమో?.... ఈసారి ఒక్క తప్పు కూడా లేకుండా రాశినా'.... అతను లేచి లుంగి సరిజేసుకుంటూ పలకా బలపం టేబులపై పెట్టాడు.

పలక మీద నాల్గు ఇంగ్లీషు వాక్యాలున్నాయి. వంకరటింకరగా ఉన్న ఇంగ్లీషు అక్షరాలు. ఒక మూలనుండి మరొక మూలకు పరుగెత్తుతున్నాయి.

.....'దట్ ఈజ్ ఎ టేబుల్.....

..... ఎ చెయిర్

..... ఎ బుక్

..... ఎ యాపిల్ .... కరెక్టు-కరెక్టు' - కరెక్టు.... అంటూ నాల్గోదానికి 'ఇంటు' మార్కు పెట్టాడు.

'వెంకన్నా... మొదటి మూడు కరెక్టు... కానీ లాస్ట్‌ది తప్పు... 'యాన్ యాపిల్' అని ఉండాలి. 'ఎ'-'ఇ'-'ఐ'-'ఓ'-'యు' లతో కూడిన మాటల ముందు 'యాన్' ఉండాలని చెప్పా కదా?'.....

"మల్లీ ఒక తప్పు పోయిందా?.... 'ఏ' - అంటే ఒకటి అని అర్థం. మరి 'యాన్' వాడకపోతే ఏం?... ఈ తిరకాసేంది?... ఇంగ్లీషులో...." శిష్యుడన్నాడు-అనవసరమైన ఆవేశంతో.

ఉపాధ్యాయుడు తల పైకెత్తి తన శిష్యుడ్ని చిరునవ్వుతో చూశాడు. ఇంగ్లీష్ ఫస్ట్ రీడర్ పట్టుకొన్న విద్యార్థి చిన్నవాడు -చితుకువాడేమీ కాదు.

ఆజానుబాహువు.

మనిషి పొడగరి.... పొడుగ్గు తగ్గ లావు. ఎండలకు, వానలకు తట్టుకొని రాటతేలిన ముఖం. దళసరి కనుబొమలు. ఆ కనుబొమల క్రింద సోడా సీసాల్లోని గోలీల్లా రెండు కనుగుడ్లు.' ఆ కళ్ళల్లో స్థిరత్వం, ధైర్యం, అమాయకత్వం తొంగిచూస్తున్నాయి.

" తిరకాసు నేను పెట్టింది కాదు. అది ఇంగ్లీషువారు పెట్టిందే.... మన తెలుగులో అచ్చులూ, హల్లులూ ఉన్నట్లు ఇంగ్లీషులో కూడా 'కాన్సొనెంట్స్' అనీ, 'వొవెల్స్' అనీ రెండు కరాలు.... వొవెల్స్ ముందు 'యాన్' ఉండాలని ఇంగ్లీషువాడి నియమం. వాడి భాషా నియమాలు వాడివి.... వాడు మాట్లాడుతున్నట్లు మాట్లాడటం మన ధర్మం...."

"ఇప్పుడు వాడు మనదేశం ఇడిసి పెట్టి ఎల్లిపోయే... 'ఏ'-అన్నా.... 'యాన్' అన్నా 'ఒకటి' - అని అర్థమయినప్పుడు, రెండింటిలో ఒకదాన్ని తీసేసి, ఇంకొకదాన్నుంచుకొంటే తప్పేంది?..."

"అదంతా తరువాత చూద్దాంలే.... ముందు నేను చెప్పినట్లు వ్రాయి."

".....నేను రాయను... ఏ యాపిల్ కరెక్టని రైటు గుర్తు పెడితేనే రాస్తాను." మొండివైఖరితో ఇంగ్లీషు రీడర్ టేబుల్‌పై పెట్టాడు. ఉపాధ్యాయుడు హిందూ పై నుండి తల పైకెత్తి కోపాన్ని నటించసాగాడు.

ఇద్దరి మధ్యా మౌనం. కొన్ని క్షణాలు. అంతలో వార్డర్ చక్రధర్ వచ్చాడు.

"రామరాజుగారూ.... మీ రిద్దరూ ఇక్కడున్నారా?.... దీని తల్లిసిగదగర... జైలు సుట్టూ తిరగలేక సచ్చిపోయినాను మీకోసం... మీకు ఉత్తరం వచ్చింది-మీగ్గాదు, ఎంకన్నకు' అంటూ చించి పగిలిపోయిన కవరు చేతిలో పెట్టాడు. జైలర్ ఆ ఉత్తరం చదివి, డిటెన్యూకి పంపాడు - వార్డర్ ద్వారా.

కవరు బరువుగా ఉంది కప్పపొట్టలా ఉబ్బి.

"సరిగ్గా ఒక ఏడాది సంగతులన్నీ ఒక్కసారే రాపించి ఉత్తరం ఏసినట్టున్నారు మా వాళ్ళు...." అంటూ ఉత్తరం చదవసాగాడు.

మహారాజశ్రీ వెంకటరెడ్డి బావగారికి, బావమరిది లచ్చింపతిరెడ్డి నమస్కారములతో వ్రాయించిన ఉత్తరమేమనగా.... ఇక్కడ మనవాల్లు అందరూ మంచిగానే ఉన్నారు. మనం కౌలుకు తీసుకున్న బూమిలో పునాస జొన్నలు గిద్దెడు మాత్తరమే అయినవి. ఎందుకంటే కంకి ఈనినాంక వానకురిసి సుంకంతా రాలిపోయి ఎక్కువ భాగం తప్ప కంకులయినవి. రెండు జల్లల కంకులు కొడితే ఒక గిద్దెడు జొన్నలు రాలటం గగనమయిపోయింది.

అతని కళ్ళలో తళుక్కుమంటూన్న ఆనందం.

అతని పెదవులపై చిరునవ్వులు.

అక్షరాలను పోల్చుకుంటూ మెల్లమెల్లగా చదువుకోసాగాడు- ఆ మాటలు తతిమ్మా ఇద్దరికి వినవస్తున్నాయన్న స్పృహ లేకుండా వెంటనే ఏదో స్ఫురించినట్లు ఆ ఉత్తరం రామరాజుపైకి విసిరాడు.

"మీరు నడవండి... నేను ఈ రకంగా చదివితే పొద్దుగూకేలాగుందని" కామెంట్ చేస్తూ.

నోటు పుస్తకంలోని రూళ్ళ కాగితాలు, ఆరు పేజీల ఉత్తరం - గొలుసుకట్ట వ్రాతలో కామాలు, ఫుల్‌స్టాపులూ లేకుండా కొండవీటి చేంతాడులా ఉంది. ఉత్తరం మొత్తాన్ని ఒకసారి మౌనంగా చదువుకొని రామరాజు బిగ్గరగా చదవసాగాడు.

.... ఇక మాగిపైరుల ఇషయం. నీ రెండెకరాల రేగడిని రెండుసార్లు గున్ని గొర్రు మూలసాలు తోలినాను. గడ్డి గాగం - నలీనలుసూ, ఏగిచ్చి మెత్తగా కుంకుమలా చేపించినాను దనియాలు చల్లుదామని, కానీ అదునులో వాన కురవేలుద. కొత్తి ఎల్లిపోయినాంక ఒక్క బట్టతడుపు వాన ఇడ్డది. ఆ వానకు బూమి సరిగ్గా నానలేదు ఇత్తనం పెట్టడానికి. అందుకని... "మొలవనియ్యి... మొలవనివ్వకపోనివ్వు... మనం సెడేది ఇత్తనాలేకదా"ని ఒక్క ఎకరంలో మాగి జొన్నలు ఏసినాము నాగటితో సాలు తోలి. రెండో ఎకరంలో ఉలవలు అలుకుడు చేసినాము.

రెండు పైర్లూ బాగా మొలిచినాయి. ఇకపోతే పైరు పలచగా ఉంది. ఇప్పుడు మోకాళ్ళ ఎత్తయింది. జొన్న-ఉలవ కూడా పూతకొచ్చింది. ఇంకా నెల రోజుల్లో కోతకొస్తది...."

"ఆగండి... జర్ర-ఆగండి.... రెండున్నరయింది. 'టీ' పెట్టాలి పొయ్యిమీద - ఇగ్గో... సెక్రం. పొయ్యి అంటించి 'ఛాయి' పెట్టు...' అంటూ ఒక బీడి చక్రధర్‌పైకి విసిరి తానొక బీడి వెలిగించుకొన్నాడు. బీడి వెలిగించుకొన్న చక్రధర్ ప్రక్కనున్న కిచెన్ భాగం వైపు వెళ్ళి పొయ్యి అంటించాడు.

"ఇక చదవండి...." ముందుకు వంగి వినయంగా అన్నాడు.

....'నీ కొడుకు బాగానే ఉన్నాడు. నువ్వు జైలుకెళ్ళినప్పుడు నీ కొడుకు అంబాడుతుండేవాడు. ఇప్పుడు బాగానే నడుస్తున్నాడు. ఉరుకుతున్నాడు. మాటలు కూడా బాగానే వత్తన్నయి.

'నీ అయ్య ఎటుపోయిండురా' అని అడిగితే,

'అచ్చిపోయిండ'ని మబ్బులంక ఏలుసూపిత్తాడు. ఆడి ముద్దు ముద్దు మాటలింటూంటే మీ అమ్మకు మొలమీద గుడ్డలు నిలవటం లేదు. "ఈడు అచ్చం వాడి-అయ్యసుమంటోడు... ఆ సూపు సూడు బొమతలు పైకెత్తుకొని... పెద్ద పులిలాగ..." అంటూ మనవడ్ని చంకనేసుకొని తెగ మురిసుకొంటది....

.... కానీ మీ అమ్మ సంగతే మాకు అనుమానంగా ఉంది.

ఈ మద్దెన మీ అమ్మకు మతిసెడ్డట్టనిపిత్తంది. ఎక్కడ సూసినా నీ ముచ్చటే, రెండో మనిషి ఇన్నా ఇనకపోయినా నీ సంగటి గోడుగోడుగా మాట్లాడుతున్నది. జొన్న కోతకు బయలుదేరిపోతున్న కూలి జనాన్ని నడి బజారులో నిలబెట్టి.... మా ఎంకన్న సంగతి ఎరికనే గదా.... ఇంకా ఇడిసిపెట్టలేదు జైల్లోనే ఉన్నారు. వాడి కోసమని నేను మనాది పెట్టుకోలేదు. పెట్టుకొని మాత్తరం సాధించేదేముంది గనుక. ఇగ్గో... బతికిన నాల్గురోజులూ సుకంగా బతకాలని మనం అనుకుంటాం గానీ, అది కూడా బెవనే... ఎందుకంటే పుట్టిన పతివోడూ బండెడు కట్టెలల్లో బుగ్గయిపోవాల్సిందే. అయితే బూవిమీద బతికిన నాల్గు రోజులు వాడు ఎట్టా బతికేడన్నదే... సివరకు మిగిలిపొయ్యేది... మన ఊరి దొర సచ్చిపోతే ఒక్కడయినా 'అయ్యో పాపం'... అన్న పాపాన పోలేదు. కిరాతకపు ముండాకొడుకు - 'ఊరి పీడా పోయిం'దన్నారు. ఆడు బతికినన్నాళ్ళూ అందమైన ఆడది కనిపిత్తే సాలు...

అచ్చుబోసిన ఆంబోతులా మోర ఎత్తి పట్టుకొని సూశేవోడు. సివరకు గుడిపూజారి పెళ్ళాన్ని కూడా ఇడిసిపెట్టలేదు... ఇంటున్నారు కదా వాడు చేసిన దురుమార్గాలు. నా కొడుకుని అన్యాయంగా జైలుఖానాలో పెట్టించాడు. నా కొడుకు ఏమన్నారు?... సెప్పండి దరమం మాట్లాడిండు.....

.....'బి లా కు అపీసోళ్ళు ఊళ్ళో పంచిపెట్టమని ఇచ్చిన కొత్తరకం మావిడిసెట్లు రెండొందలు నీ పెరటిలో పెట్టించు కొన్నావ్?... అవి, నీ తాతగాడి సొమ్మనుకొన్నావాని అడిగిండు...

"మాదిగోల్ల కిమ్మన్న గవిడిబర్రెల్ని (ముర్రా)ను నీ దొడ్లో కట్టేసుకున్నావ్ అని దొరని బొడ్లో సెయ్యేసి నిలదీసి అడిగిండు....

"సర్కారోడు-సన్నకారు రైతుకు పంచిపెట్టమన్న సీమ ఆవుల (జెర్సీ)ను నీ సుట్టాలకు తోలిపెట్టినావ్?... అని పదిమంది ముందూ అడిగి పరువు తీశిండు...

"గవర్నమెంటోడు మేలు రకం ఆంబోతుని ఇత్తనానికని ఊళ్ళో పెంచాయితీకిత్తే దాన్ని దొంగతనంగా పదివేలకమ్ముకొన్నావ్.... నీది ఒక బతుకేనా? అని బొడ్డురాయికాడ నిలదీసి అడిగిండు నా కొడుకు... అన్ని మాటలడిగిందుకున్న ఎదవ ఎవడయినా, సీమూ నెత్తురుంటే ఏ గంగలోనో దూకి సచ్చిపొయ్యేవాడు... కానీ మానం తక్కువ ఎదవ వాడు.... సిగ్గూ లజ్జా పెట్టలేదు భగవంతుడు ఆడికి... ఆడు ఏం జేసిండో ఎరికే గదా మీకు...

"ఉరుకులు పరుగుల మీద సైకిలు మోటరెక్కి పట్నం పోయిండు. నా కొడుకు సంగం పెట్టిండని, పోలీసుతానాలో రిపోట్టుసేసి పోలీసులను తోలుకొచ్చిండు. నా కొడుకుని జైల్లోపెట్టించినాంక కూడ ఆడు ఆదమరిసి నిద్రపోలేదు... ఇంకా నా కొడుకు పార్టీ వాళ్ళొచ్చి యాడసంపుతారోనని, మిలటరోళ్ళను కాపలా పెట్టించుకొన్నాడు సచ్చేదాక... సివరకు వాడెట్టా సచ్చిపొయ్యాడో తెలుసుగా... నిక్కుట్టపు సావు సచ్చిండు. ముడ్లో అరిసెమొల్లలు బుట్టి రకతం కారి కారి సచ్చిండు. సేదుకొని, సేదుకొని సచ్చిండు... వాడికి ఒక్క రోగమా?... సవాలచ్చ రోగాలు... వీడి జిమ్మడ..." అని తిట్టుకుంటూ మెటికలు విరుచుకుంటూ అందరితో గంటల తరబడి చెబుతోంది.

ఆమె మాట్లాడేవన్నీ మంచిమాటలే కానీ, ఏదో పిచ్చివాలకం ఉంది ఆ చూపులో,... ఆ మాటల్లో. దొర సంగతి వచ్చినప్పుడు పిచ్చినవ్వు నవ్వుతుంటది. అమెకి మన ఊళ్ళో కొత్తవాళ్లెవరూ లేరు. కానీ ఆమె అందర్నీ కొత్త వాళ్ళను పల్కరించినట్లు పలకరించి నీ సంగతి చెబుతుంటది.

మొన్న మట్టికి మొన్న, కోటేరు ఏసిన ఎడ్లను తోలుకొని నేను చేనికి పోతంటే నన్ను నడిబజార్లో నిలబెట్టి మొదలు బెట్టింది...

"ఒరేయ్ లచ్చింపతీ... నా కొడుకుని జైల్లో పెట్టారని నాకేం దిగుల్లేదు. ఏ వాడకు పోయినా, ఎవ్వరిళ్ళముందు నడిసిపోయినా...

"ఎంకన్న తల్లివా?... రా... కూసో"...మని.

"ఎండనబడి వచ్చినట్టుంది..... 'సల్లదాగ' మని... 'బువ్వ తిన'మని చేతులు పట్టుకొని బతిమాలతారు. ఏ తల్లికున్నదంటావ్?... ఈ మరియాద. ఆ మరియాదంతా ఎందుకు సేత్తన్నారంటావ్?... మా ఎంకన్న ఊరికి సేసిన మంచి పనుల మూలంగానే... ఎపుడయినా రైతు దొరతో పేచీపెట్టుకొని....' ఈ యవ్వారం మాట్లాడటానికి నేను ఎంకన్నను తెచ్చుకొంటాననంటే అడు వణికిపొయ్యేవాడు... నీ యవ్వ... నా కొడుకు పేరు పేరు సెబితేనే దొర ఉచ్చబోసుకొనేవాడు...." అంటూ బిగ్గరగా నవ్వింది.

వెంటనే ఆ నవ్వు టక్కున ఆపివేసింది. మళ్ళీ కళ్ళు పెద్దఆ సేసుకొని నావంక చూసింది. నాకు భయమేసింది. మళ్ళీ మబ్బులంక సూత్తూ మళ్ళీ మెల్లగా మొదలు పెట్టింది.

"ఇదంతా ఎందుకు సెబుతున్నానంటే లచ్చింపతీ... మా ఎంకన్న పసిగుడ్డు వాడి అయ్య సచ్చిపోయేనాటకి.... ఆరోనెలో, ఏడో నెలో. కాకపోతే అడి అయ్యను బగమంతుడు తీసికెళ్లిండు, ఈడ్ని పోలీసులు తీసికెళ్ళిపోయిన్రు – అంతే తేడా... ఆ రోజు నుంచి నా రెక్కల కట్టం నాది. ఎవుడి ముందూ సెయి సాపకుండ ఆడ్ని బతికించుకున్నా... ఆరోజు నుండి ఆడి అయ్య పేరు ఎవుడికి తెలవదు... మన ఊళ్లో గానీ, మన ఊరు చుట్టుపట్ల పది ఊళ్ళలో.

ఆడ్ని... "సీతమ్మ కొడుకు ఎంకన్న" అంటారగానీ ఏరే పేరుబెట్టి పిలవరు.... ఈ జలమకిది సాలు... బతికినన్నాళ్ళూ 'పదిమందికోసం

బతికినోడిదే జలమంటా నేను'.... అంటే టక్కిన మాటలాపి.... "బారెడు పొద్దెక్కినదాకా అరక కట్టనోడివి నువ్వేమి రైతువిరా - ఎదవ సన్నాసి... అదిరించు ఎడ్లని" - అంటూ బాటకు అడ్డం తొలిగింది.

ఇవన్నీ ఇపులంగా ఎదుకు రాపిచ్చానంటే ఊళ్ళో చిన్నా పెద్దా అంత తలా ఒక రకంగా సెప్పుకుంటున్నారు. ఏనాడో జరిగిపోయిన సంగతులను తవ్వుకొని, తవ్వుకొని మాట్లాడటం సిన్న సంగతి కాదంట. ఇదేదో 'గాలి' పట్టిందంటన్నారు కొంతమంది పెద్దమనుషులు - ఇవన్నీ పిచ్చిలచ్చనాలు.

మైండు చెడిపోయింది. ఎర్రగడ్డకు తోలుకపోయి పెద్ద డాకటర్లకు సూపియ్యమంటారు. అయిదరాబాద్‌కు పోవటమంటే కరుసుతో కూడిన పని. కనీసం నూట యాభై రూపాయలన్నా కావాలి. అందుకని జెత దున్నపోతుల్లో దాపటదానిని వచ్చేవారం అంగడికి తోలుకపోయి అమ్ముదా మనుకొంటున్నాను. అమ్మమంటావో, వద్దంటావో ఉత్తరం రాసియ్యి.

ఇట్లు

బావమరిది - లచ్చింపతిరెడ్డి

రామరాజు ఉత్తరం చదవటం ముగించి నెత్తిమీద పడిన గడ్డిపరకలను వదిలించుకొని కప్పుకేసి చూశాడు.

సమతలంగా ఉన్న దూలంపై పిచ్చికలు గూడుకట్టటానికి ప్రయత్నిస్తున్నాయి.

ఎన్నో గడ్డిపరకలూ, ఎంతో పీచూ, ముక్కనకరచి తెచ్చినా, గూడు కుదరటం లేదు. పరకలన్నీ రాలి పడిపోతున్నాయి.

ఉత్తరం ప్రారంభించినప్పుడు అతని కళ్ళలో ఆనందం అదృశ్యమైంది. నిరాశగా నీరసంగా కనురెప్పలు వాలిపొయ్యాయి. కొన్ని నిముషాలు పిచ్చుకలను మౌనంగా పరిశీలించి పెదవులు కదిల్చాడు - వెంకన్న.

"బట్టలూడదీసికోవటం-మందిని కరవటం... ఇసుమంటివి పిచ్చిలచ్చనాలంటారు. మా అమ్మకు పిచ్చికాదు. ఆమె మాటలన్నీ జరిగిన సంగతులే...." స్వగతంతా మాట్లాడుకొన్నట్లు పొడి పొడిగా అన్నాడు.

చక్రధర్ టీ కెటిల్ తెచ్చి టేబుల్‌పై పెట్టాడు. రెండు గ్లాసుల్లో 'టీ' పంచి ఇద్దరికీ అందించాడు. వాళ్ళిద్దరూ 'టీ' చప్పరించసాగారు - ఒకరికేసి మరొకరు చూసుకొంటూ.

"మరి ఇప్పుడు ఉత్తరం వ్రాయవా?... దీనికి సమాధానంగా..." రామర్రాజు ప్రశ్న.

"రాయను... నేనొకటి రాసి.... వాళ్ళింకొకటి రాశి.... అనవసర రామాయణం...."

"అదేటి గురూ, సిత్రంగా ఉంది... ఉత్తరం రాయవా? - పాపం ముసలమ్మ... మీ అమ్మను జైలుకొచ్చినిన్ను సూసి పొమ్మని రాయి...." కప్పులో 'టీ' పోసికొని త్రాగుతూన్న చక్రధర్ జాలిగా సూచించాడు.

"రామను... ఎందుకంటే మా ఊరు దగ్గరా దాపూ కాదు. కనీసం పన్నెండు రూపాయల చార్జీలు. రాను పోనూ కనీసం ఇరవై అయిదు రూపాయలు. ఇక దారి కరుసు - తిండి తిప్పలూ అటుంచండి. ఈ ఇరవై అయిదు రూపాయలు వాల్లకెవురిత్తారు సెప్పండి. మా చేలో పండే జొన్నలు మాకు నాలుగు నెలల గ్రాసం. మా చేలో పనిలేని రోజున నా భార్య కూలికిపోతది. మా ఊళ్ళో ఆడమనిషి కూలి మూడు రూపాయలే. ఆ మూడు రూపాయల్లోనే బియ్యం, ఉప్పు, నూనె, చింతపండు, కరుసులెల్లాలి. దాని సంపాదన వాళ్ళ తిండికే సరిపోదు. ఇక నా దగ్గరకు రావాలంటే రోజూ అయిదు పైసలో పది పైసలో గురిగిలో దాశి పొదుపు సెయ్యాల... ఎన్ని అయిదుపైసలయితే ఇరవై ఐదు రూపాయలు కావాలి... అందుకోసమనే నేను ఎవుర్నీ జైలుకు రమ్మని ఉత్తరం రాయను..." అతని కంఠం అదోలా మారిపోయి గుటకలు మ్రింగుతూ మాట్లాడాడు. చివరి మాటలో ఆ కంఠం బొంగురుగా, బండగా మారిపోయింది.

నిర్జీవమైన అతని కళ్ళలో స్థిరమైన అభిప్రాయాలు.

'టైం' మూడు గంటలు. చక్రధర్ పళ్ళెంపై గరిటతో కొట్టిన శబ్దం - 'టీ' కోసం రమ్మని డిటెన్యూలకు పిలుపు. అప్పటివరకు శవాకారంలో ముసుగు తన్నిన డిటెన్యూలు గ్లాసులు పట్టుకొని డైనింగ్ హాలువైపు రాసాగారు- ఒక్కొక్కరే.

ఒక నెల రోజుల తరువాత.

ఆవేళ సోమవారం-ఉదయం పది గంటలు.

డిటెన్యూలు కొందరు సింగిల్ రూమ్ సెల్స్ ప్రక్కనున్న నీడలో కూర్చొని సుధీర్ఘమైన చర్చలలో మునిగిపొయ్యారు.

వాళ్ళు మాసిపోయిన గడ్డాలతో, లుంగీలు, బనియన్లపై ఉన్న అల్పజీవులు.

నియంతృత్వాన్ని ఎదిరించి, నిర్బంధానికి తలవొగ్గని అత్యంత శక్తివంతులు. తమపై ఆధారపడిన కుటుంబ సభ్యుల శ్రేయస్సు విస్మరించిన నిస్వార్థజీవులు.

....'ఇరాన్‌లో కల్లోలం. ఈజిప్టు ఇజ్రయిల్ యుద్ధం-నబిబియా విప్లవం - మావో మరణఫలితంగా చైనాలో వచ్చిన మార్పులు' ఇంకా ఎన్నో ఎన్నో విషయాలు.

వాళ్ళ పెదవులపై.... ఉద్యమాలు - పోరాటాలు.

వాళ్ళ కళ్ళల్లో..... సుదూర ఖండాలను చూసే టెలిస్కోపులు.

భూమిచుట్టూ పరిభ్రమించి, పరిభ్రమించి ఇండియా కొచ్చారు వాళ్ళు. మళ్ళీ ఇండియాలో బహుళజాతి సంస్థల పెట్టుబడులను చర్చించారు. దేశంలో ఎమర్జెన్సీ కాలంలో సంభవించిన పరిణామాలు, ప్రభుత్వ ప్రకటనలలోని ఆంతర్యాన్ని లెక్కలువేసి ఊహాగానాలు చేయసాగారు.

"అందువలన.... వచ్చే నెలలో కొందరివి విడిచిపెట్టవచ్చు" - ఒకరి ఊహ.

"మీ అంచనా తప్పు... మీరనుకున్నట్టు ఎవర్నీ విడిచి పెట్టరు... ఇడిసిపెట్టేవాళ్ళయితే ఈ సంవత్సరం కొత్త డిటెన్యూలను జైళ్ళల్లోకి పంపరు..." వెంకన్నగొంతు ఖండించింది.

ఆ చర్చలకు అంతరాయం కల్గింది.

"ఇవిగో మైసూర్ పాక్ ముక్కలు అరటిపళ్ళు. డాక్టర్ సాబ్ పంపారు. తలా ఒక అరటిపండు ఒక మైసూర్‌పాక్..." అంటూ పెద్దగా కేకలు వేసికొంటూ వచ్చిన వార్డర్ చక్రధర్ వాటిని పంద్యారం చెయ్యసాగాడు... ఎయిర్ బ్యాగ్ నుండి.

డిటెన్యూలను చూడటానికొచ్చిన భార్యాపిల్లలూ, తల్లిదండ్రులూ వాళ్ళ కోసం మిఠాయిలు తీసుకొస్తారు - హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులకు తెచ్చినట్లు. వాటిని అందరికీ పంచిపెడతారు.

"డాక్టర్ రఘునాథం బాబుగారి భార్యా-కొడుకూ వచ్చారు ఇంటర్వ్యూకి. ఇంటర్వ్యూలో ఆ అమ్మగారితో మాట్లాడటం మానేసి కొడుకుని పట్టుకొని కంటికి, మంటికి ఏకధారగా ఏడిశేసినాడు... పక్కనున్న సి.ఐ.డి. ఇనస్పెక్టర్ బాబు కూడా కళ్ళనీళ్ళు పెట్టేసు కున్నాడు.... ఆ బాబుకు ఒక్కడే కొడుకంట ఎంకన్నకు నాగ..."

గోదావరి జిల్లాల తెలుగు యాసతో చెప్పుకుంటూ వాటిని పంచుతున్నాడు.

"పట్టు గురూ... చెయ్యి సాపు.... ఇంకా చాలా మందున్నారు... మీ అమ్మ మొన్న శనివారం నీకోసం వచ్చినప్పుడు ఏరిశెనక్కాలన్నా తేలేదా?... ఏటి తెచ్చిందో ఎవరికీ పెట్టెయ్యకుండ, గప్‌చిప్‌గా తినేశినావ్ ఎంకన్నా...." అంటూ వెంకన్న చేతిలో పెట్టాడు.

వెంకన్న నిర్ఘాంతపొయ్యాడు. కొద్ది క్షణాలు గుడ్లప్పగించి చక్రధర్‌కేసి చూసి... "మా అమ్మనా?... ఎందుకొచ్చింది? రాలేదే?..." అన్నాడు.

"రాలేదా?... వచ్చింది వెంకన్నా... అయితే నిన్ను ఇంటర్వ్యూకి పిలవలేదా మొన్న...."

"పరాచికాలాడకు... నిజంగా మా అమ్మ వచ్చిందా?..."

"నిజంగా వచ్చిందాంటే?... నేను అబద్ధం సెబుతున్నాననుకోంటున్నానేటి?... నీతో పరాచకమేటి నాకు... వచ్చింది మీ అమ్మనే.... మొన్న శనోరం నాడు నేను నల్లటోపీ వాళ్ళను ఎంటబెట్టుకొని గేటు బయట తోటలో పాదులు సేయించటానికి పోతున్నాను... అప్పుడు రావిచెట్టు కింద కూసోని ఉంది మీ అమ్మ... ఈమెను ఎక్కడో చూసినట్టుందని బుఱ్ఱ గోక్కున్నా... అప్పుడే నీ ముఖం గ్యాపకమొచ్చింది...."

"నువ్వు ఎవర్నో సూసి మా అమ్మ అనుకోనుంటావ్... మా అమ్మ ఎట్టుంటది సెప్పు?...." వెంకన్న కళ్ళలో సందేహం.

"లేదు వెంకన్నా..." సత్తె పెమానంగా సెబుతున్నాను. మీ అమ్మనేనయ్యా... నీకులానే నల్లగా ఉంటది... కానీ నీ అంత ఎత్తు లేదు. అంతే... నువ్వు మీ అమ్మ నోటిలో నుండి ఊడిపడినావనిపిస్తది. అనుమానమెందుకని నేను ఆమె దగ్గరకు పోయి 'నువ్వు ఎంకన్న తల్లివా'ని అడిగేశాను. 'ఔన'న్నది. ఇక్కడగాదు-అక్కడకు పోమని' సూపెట్టి నేను పనిలోకి ఎల్లిపోనాను... చానా కట్టంగ అంగలేత్తా నడిసింది గేటుకాడికి.... వంకాయరంగు ముతక సీరె కట్టుకుంది"....

"సెక్రం.... ఇక సెప్పకు... ఇక వివరాలు అనవసరం. నువ్వు సూసింది మా అమ్మనే.... కానీ ఆ లంజకొడుకు జెయిలర్, నాకెందుకు ఇంటర్వ్యూ ఇయ్యలేదు. దొంగ బాడఖోవ్ "... ఆవేశంతో వెంకన్న ఊగిపోసాగాడు. అరటిపండు, మైసూర్‌పాక్ విసిరిపారేశాడు. కళ్ళలో చింతనిప్పులు మండాయి.

"వెంకన్నా... తొందరపడకు... వాస్తవ విషయం పూర్తిగా తెలుసుకొందాం"... మిత్రులు హెచ్చరించారు. తినటం ఆపేసి.

"వారానికి రెండు ఇంటర్వ్యూలివ్వాలని గవర్నమెంటు రూలుంది కదా.... మరి నాకెందుకివ్వలేదు... రాకరాక మా అమ్మ నన్ను సూడటానికొత్తే ఆడు నాకు ఇంటర్వ్యూ ఇవ్వలేదు.... ఏమిటీ అన్యాయం...." కోపంతో దుఃఖంతో ఊగిపోతూ బిగ్గరగా కేకలు వేయసాగాడు. ముఖమంతా చిరు చెమటలతో వాడిపోయింది. పెదవులపైన, ముక్కుపైన సన్నని నరాలు తంపించసాగాయి.

"సెక్రం... గేటులోకి పోదాం పద.... వాడ్ని ఈయేళ తంతాను. మనం తప్పు సేసినా సెయ్యకపోయినా ఈడ ఉండకతప్పదు. కాబట్టి వాడ్ని తన్ని ఇక్కడ ఉండిపోతాను. జైలర్‌ను తన్నిన పేరుంటది నాకు... ఛలో... నీయవ్వ..." అంటూ విపరీతమైన కోపంతో ఒణికిపోతూ ఒక బీడి వెలిగించాడు.

"అంతే గురూ... మీరు ఎలాగయినా పెళ్ళాం పిల్లలకు దూరమైపోనారు. మిమ్మల్ని ఇంతలో ఇడిసిపెడతారన్న ఆశ లేదు. మరీ మీరు ఈ కొడుకులకు ఎందుకు లొంగుండాలో నాకు సెప్పు. నేనంటే నేను డబుల్ మర్డర్ సేసి జైలు కొచ్చేసినాను. మరి మీరు రాజకీయం మనుషులు...

డిటెన్యూలు.... మీరెందుకుండాలిక్కడ నాకు లాగ.... జైలర్ సంగతి తేల్చుకోవాల్సిందే... దరమం తప్పిన పతి ఎదవకూ బుద్ధి సెప్పాల్సిందే... ఇష్టసెక్రం ఇడిసి పెట్టాల్సిందే..." అందరికీ పంచిపెట్టగా మిగిలిన మైసూర్‌పాక్‌లూ, అరటిపండ్లూ మెత్తగా తింటూన్న చక్రధరం, ఆవేశరహితంగా, లయబద్ధంగా హుందాగా ఉపన్యాసమిచ్చాడు.

బీడీ వెలిగించిన వెంకన్న నాల్గు దమ్ములు లాగి అవతల పారవేశాడు. జైలర్‌ను కొట్టాలన్న ఆలోచన నిర్ణయంగా మారినట్లు ఛాతి ఎత్తుగా ఉబ్బింది. పిడికిళ్ళు బిగుసుకున్నాయి. పెద్ద పెద్ద అంగలు వేస్తూ ఆఫీసువైపు కదిలాడు.

"వెంకన్నా... జైలర్‌ను ఏమీ అనకు... అందరం పోదాం ఉండు... మేం అడుగుతాం సూపరిండెంట్‌ని" అని కేకలు పెడుతున్న జంగన్న-రామరాజులు ఈతన్ని అనుసరించబొయ్యారు.

"మీరెందుకూ?... ఒకవేళ ఆ మాట వాస్తవమయితే వాడు శిక్షార్హుడే... వాడికొకసారి తన్నులు తగలాలి. జెయిలర్ తప్పుకు యాక్షన్ తీసికోకబోతే రేపు మనం నిరాహారదీక్ష చెయ్యాలి.... ఎన్నో అన్యాయాలు జరుగుతున్నయి ఈ జైళ్ళో".... అంటూ విద్యార్థి డిటెన్యూలు వాళ్ళను ఆపివేశారు.

......

జెయిలర్ ఆఫీసులో జరుగుతూన్న గొడవ విని అందరూ బయటికొచ్చారు. వార్డర్స్, డ్యూటీలో ఉన్న పోలీసులు - అందరూ రాబందుల్లా అక్కడ వాలారు. జైలర్ మీదకు ఆవేశంగా పోతూన్న వెంకన్నను ఇద్దరు పోలీసులు గట్టిగా పట్టుకొన్నారు. జైల్లో నేసిన దుప్పట్లను మడతలు వేస్తూన్న ఖైదీలు ఆ గోలంతా విని, పని మానివేసి అక్కడ గుమిగూడారు.

అంతా గందరగోళ పరిస్థితి.

వాళ్ళిద్దరూ ఎందుకు ఘర్షణ పడుతున్నారో ఎవరికి అర్థం కావటం లేదు. వెంకన్న తన మీదకు ఎందుకు దౌర్జన్యంగా వస్తున్నాడో జైలర్‌కు స్ఫురించటం లేదు.

ఆ కేకలూ అరుపులూ విని జైలు సూపరిండెంట్ ఆఫీసు బయటికొచ్చాడు. హేట్ నెత్తిన పెట్టుకొని నాజూగ్గా లాటీ ఊపుకొంటూ.

"సింగిల్ సెల్‌లో వేయించుతావా నన్ను... నేను మామూలు ఖైదీలనుకొంటున్నావా?... నేను డిటెన్యూని... గ్యాపకముంచుకో, మామూలు ఖైదీలను బెదిరించినట్లు బెదిరిత్తే నీ అంతు సూత్తా...'' గాలిలో సేతులూపుకుంటూ రొప్పసాగాడు-వెంకన్న.

"ఏమిటి సంగతి'.... ఎందుకు మీరంతా గుమిగూడారు. ఎక్కడివాళ్ళక్కడ వెళ్ళిపోండి"... అధికార కంఠంతో హెచ్చరించాడు సూపరిండెంట్.

"చూడండి సాబ్... అతను వచ్చిన విషయం ఏమిటో చెప్పకుండా నన్ను కొట్టటానికి ప్రయత్నించాడు... నానా బూతులు తిట్టాడు...." జైలర్ అభియోగం - ఉర్దూలో.

ప్రశ్నార్థకంగా వెంకన్నపై చూపు నిలిపాడు-సూపరిండెంట్.

"సార్... నా జైలు జీవితంలో నా కోసం ఎవరూ రాలేదు. రాక రాక నా తల్లి ముసలమ్మ సచ్చిపోవటానికి సిద్ధంగా ఉంది. నన్ను సూసిపోదామని వత్తే పరిమిషన్ ఇవ్వలేదు ఈయన... మా ఊరు దగ్గరా దాపూ కాదు. నల్లగొండ జిల్లాలో ఒక మారుమూల పల్లె... చదువురానివాళ్ళకూ, డబ్బులేనివాళ్ళకూ, పలుకుబడి లేనివాళ్ళకూ ఈ జైల్లో స్థానం లేదా? పేదవాళ్ళంటే ఇతని దృష్టిలో పశువులకన్నా హీనం.... ఒక్కసారి... ఒక్కసారి, మా అమ్మను సూడటానికి నోశుకోలేదా? నేను".... అతని కంఠం రుద్ధమై రెండు కన్నీటి బొట్లు అతని చెంపలపై జారిపోయ్యాయి.

"ఎందుకు పిలవలేదు వాళ్ళమ్మను... మీరు చేసే తప్పుడు పనులకు నేను విమర్శకు గురికావలసి వస్తుంది. నాకు చెడ్డ పేరు తెప్పించడానికి కాకపోతే, వెంకన్న తల్లికి ఎందుకు ఇంటర్వ్యూ ఇవ్వలేదు..." అధికార దర్పం ఉట్టిపడే కంఠంతో ఉర్దూలో ప్రశ్నించాడు.

ఆ మాటలు జైలర్‌లో కొంత తొట్రుపాటును కలిగించాయి.

"మొన్న వీరి తల్లి ఇంటర్వ్యూ కోసం రాలేదు సాబ్... శనివారం ఇంటర్వ్యూ కోసం దరఖాస్తులిచ్చిన లిస్ట్ చూడండి... వెంకన్న కొరకు ఎవరూ రాలేదు" - ఖచ్చితంగా చెప్పాడు జైలర్.

"సరిగా చూడు మళ్ళీ... నాతో అనవసరంగా వాదించకు. ఆ లిస్టంతా సరిగా వెదికి ఆమె ఉంటే ఈ రోజు ఇంటర్వ్యూ ఏర్పాటు చెయ్యి"... ఆజ్ఞాపించాడు సూపరిండెంట్ లోనికి వెళుతూ.

"యస్... సార్"... శెల్యూట్ కొట్టాడు జైలర్.

మామూలు వాతావరణం నెలకొన్నది. ఎవరి పనులు వారు చేసికోసాగారు. జైలర్ తన టేబుల్ ముందు కూర్చున్నాడు. శనివారం నాటి డిటెన్యూల ఇంటర్వ్యూల లిస్టుని గుచ్చిగుచ్చి చూశాడు. వెంకన్న కోసమై ఇంటర్వ్యూకి ఎవరూ రాలేదు.

"ఏదీ మీ అమ్మ అప్లికేషన్.... నువ్వే చూసుకో లిస్టు"... జరిపాడు ఆ కాగితాలను, అతనికి ఏమీ పాలుపోలేదు. అంతా అయోమయంగా ఉంది చక్రధర్ మాటలు నమ్మి జైలర్‌పై నోరుపారేసుకొన్నందుకు తనకు తానే నిందించుకోసాగాడు.

"మీ అమ్మ పేరు సీతమ్మ కదూ?... ఇదిగో సార్ ఖైదీల ఫైలులో ఉంది"... టేబుల్ ప్రక్క చాపమీద కూర్చున్న వార్డర్స్‌లో ఒకరు స్లిప్ అందించాడు – బొటనవ్రేలు గుర్తున్న కాగితాన్ని.

"అట్లాగా ఏదీ?"... జైలర్ ఆ కాగితం అందుకున్నాడు. ముఖం వెలవెలా బోయింది. మళ్ళీ వెంటనే ముఖం గంభీరంగా మారిపోయింది.

"ఇదిగో వెంకటరెడ్డి... ఇందులో నీ గూర్చిన వివరాలు లేవు. నీ ఇంటి పేరు లేదు. తండ్రి పేరు లేదు .. నువ్వు యావజ్జీవన ఖైదీవని గానీ, సాధారణ ఖైదీవనిగానీ, బాల నేరస్థుడవనిగానీ వివరాలు లేవు.... 'ఆమె నీ తల్లి' అని నేను కలగనాలనా" – అన్నాడు.

తల్లి అమాయకత్వానికి, అసహాయతకు లోలోన కృంగిపోయాడు.

"మొన్న మా వెంకన్నను సూపియ్యండయ్యాంటూ నల్లని ముసలమ్మ అందర్నీ అడిగిన మాట నిజమే సార్. కానీ మన జైల్లో ఉన్న తొమ్మిది వందల మంది ఖైదీలలో ఈ పేరుగల వాళ్ళెవరూ లేరు... అందుకని ఇక్కడ లేదని పంపించాం. ఆమె ఒక్కమాట 'పొలిటికల్ డిటెన్యూ' అన్నట్లయితే ఈ గొడవంతా ఉండేదే కాదు.... దానికి మనమేం చేస్తాం"... జైలర్ మాటలను సమర్థిస్తూ వార్డర్స్‌లో ఒకరు అంటున్నాడు.

"ఖైదీలలో లేకపోతే... డిటెన్యూలలో చూడవచ్చు కదా... అన్నీ నఖరాలు కాకపోతే"... అంటూ దిగ్గున లేచాడు. పొంగులు వారుతూన్న దుఃఖాన్ని అణచుకుంటూ బరువైన గుండెలతో బయలుదేరాడు. తన తల్లి అమాయకత్వాన్ని ఆలోచిస్తూ.

తన తల్లికి 'జైలు' అంటే నేరస్తుల నిలయమన్న భావన తప్ప మరొకటి లేదు. తన కొడుకు ఏ రకమైన కారణాల వలన నిర్బంధించబడ్డాడో తెలియని అమాయకురాలు ఆమె... పాపం ఆమెకు కనీసం కట్టుకోటానికి సరియైన చీరె కూడా లేకపోయి ఉండవచ్చు. ఏదో ముతక రకం పాత చీరె కట్టుకొని ఉండవచ్చు. పేదరికం ఉట్టిపడుతూన్న తన తల్లి వేషభాషలు చూసి ఆమెనొక డిటెన్యూల తల్లిగా భావించి ఉండరు జైలువాళ్ళు... ఏ మర్డరర్ తల్లిగానో, ఏ జేబుదొంగ తల్లిగానో భావించి వెళ్ళగొట్టి ఉంటారు....

ఆ విధంగా ఆలోచిస్తూ 'బ్యారక్స్' కేసి వెళ్ళబుద్ధి కాక అరటిచెట్ల నీడలో కూలబడిపొయ్యాడు.

......

పదిహేను రోజులు గడిచిపొయ్యాయి.

ఆ రోజు సాయంత్రం, ఆరు గంటలు. పోలీసులు డ్యూటీలు మారుతున్నారు. ఎత్తయిన ఆ జైలు గోడల మధ్య సంధ్య చీకట్లు దట్టంగా కమ్ముకొన్నాయి. పగలంతా విరగబూసిన గులాబీల రేకులు రాలిపడిపోతున్నాయి.

డైనింగ్ హాలులో వెంకన్న మెస్ లీడర్‌గా తన బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. గోధుమరొట్టెలు పీటపై రుద్దుతున్నాడు. వంట డ్యూటీ పడిన నలుగురు డిటెన్యూలు పిండి పిసుకుతున్నారు.

వెంకన్నకు ఉత్తరం అందించి వెళ్ళిపోయాడు వార్డర్ - చించి చదవబడిన ఉత్తరం. తెల్లటి పిండి చేతులతో ఉత్తరం ముడతలు విప్ప చదువుకోసాగాడు.

మహారాజశ్రీ వెంకట్‌రెడ్డి బావ గారికి బావమరిది లచ్చుంపతిరెడ్డి నమస్కారములతో వ్రాయించిన ఉత్తరమేమనగా...

మీ తల్లి సీతమ్మగారు పోయిన బుధవారం నాడు కాలం చేసింది. ఆమె సచ్చి పోయినప్పుడు అయినవాళ్ళం మనం ఎవరమూ లేము. ఇక వారం రోజులకు సచ్చిపోతదనంగ ఆమె నిన్ను ఎతుక్కుంటూ వరంగల్లు వచ్చింది. ఆమె 'సల్ల'మ్ముకొని 'పెరుగ'మ్ముకొని ముప్పయి రూపాయలు బస్సుచార్జీల కోసమని ఎనకేసింది.

ఆమెకు ఆయిదారు నెలలనుండి నీరు సూపించి, కాళ్ళు, సేతులూ తంబాల్లాగా అయిపోయినయి.

"ఈ బొందిలో జీవుడు ఎల్లిపొయ్యేలోగా మా ఎంకన్నను ఒక్కసారి సూసి సచ్చిపోతా... వాడ్ని ఎటు తిరిగీ ఇడిసిఎట్టరు. నేనే ఎల్లి సూసిరావాలి... కొడుకుని ఇడిసి పెట్టేదాక నేను బతకను" అని సెబుతూండేది ముసలమ్మ.

మీ అమ్మకు సదువు రాదు కానీ చాలా దయిర్నం కలది.

నిన్ను సూడాలని బయలెల్లినప్పుడు... దగ్గరా దాపా... నువ్వు ఒక్కదానివే పొయ్యి రాలేవు... ఎక్కడయినా అడ్డం బడిపోతే అక్కడ మనకు దిక్కెవడని నాల్గురోజులు ఆగమని' మొత్తుకున్నాం. అయినా ముసలమ్మ ఇనిపించుకోకుండా వెళ్లింది.

పదిమైళ్ళు కాలినడక నడిసి సూర్యాపేట చేరి వరంగల్లొచ్చిందట. 'మా ఎంకన్నను ఈడనే పెట్టింరట' అంటూ జైలు ముందు ఒక రోజంతా కూసున్నదట. అందరికి దణ్ణంపెట్టి అడిగిందట. 'లేద'ని సెబితే కంటక నీరెట్టుకుంటూ ఇంటికి తిరిగొచ్చింది.

మొన్న బుదవోరం పొద్దుగాల్నే ఆమెకింత బెట్టి మేం పొలం పోయినాం. మాగిజొన్న ఒక్క మునుం కోత కోసినామో, లేదో, మా ఎనకనే మనిషొచ్చిండు... ఎంకన్న తల్లి ఎల్లిపోయిందని.

మంచంలో పడుకొని ఒక్కటే ఎర్రి కేక పెట్టిందట.

"ఎంకన్నా.... కొడుకా.... వచ్చావా..... నీ కోసమే, ఇన్నాళ్ళూ బతికినా" అని లేచి ఎనక్కు ఇరుసుకొని పడిపోయిందంట. ఇరుగుపొరుగంతా సేరి గొంతులో నీళ్ళు పోశారంట. గుటకబడలేదంట. ఆమె కళ్ళరెప్పలు మూతబడకుండా అట్లాగే చూత్తన్నయి నీకోసం ఎదురుచూస్తున్నట్లుగా.

మనం అనుకుంటాంగానీ, నువ్వొత్తే మాత్రం పొయ్యే పానం ఆగుద్దా- మన పిచ్చిగానీ, ఆవిడ పొయ్యే రోజు వచ్చింది-ఎల్లిపోయింది. నువ్వు దిగులు పెట్టుకోమాకు. దిగులుపడి నువ్వు మాత్రం చేసేదేముంది? పోయిన మనిషి తిరిగి రాదు కదా?

ముసలమ్మ గొప్ప అదురుట్టం కలది. దాని బలగమంతా వచ్చారు. ఆమెను పారేత్తారనికి పై వచ్చే బుధవోరం పెద్ద దినం, అన్నటికి నువ్వు శెలవు తీసుకొని రావల్సింది.

నమస్కారములతో
బావమరిది-లచ్చింపతిరెడ్డి.

ఆ ఉత్తరం చదివిన వెంకన్న బావురుమని ఏడ్వలేదు.

గుండెల్లో గుబులను, సుళ్ళుతిరుగుతూన్న బాధను పెదవుల మధ్యన నొక్కిపట్టారు. కొరడుకట్టిన దీపంలా ముఖం కాంతి విహీనమైపోయింది. పిండి పిసికి ఆరిపోయి బిగుసుకుపోయిన చేతి వేళ్ళను లాక్కుంటూ కూర్చున్నాడు.

అతను ఎంతో కాలంగా పవిత్రంగా అపురూపంగా దాచుకొన్న తల్లి స్మృతులు కళ్ళముందు పరిభ్రమించసాగాయి. చివరిసారిగా తన కొడుకుని చూడగలిగానన్న ఆనందం మిగుల్చుకోకుండా చనిపోయిన తన తల్లి, ఆరోజు తనకోసం జైలు ఎదుట రావిచెట్టు క్రింద ఆ ముసలి హృదయం ఎంత తల్లడిల్లిపోయిందో ఊహించుకోసాగాడు.

తనకోసం జైలు ఎదుట ఒక రోజంతా పడిగాపులు కాచి, కాచి ఎంత దయనీయంగా వెళ్ళిపోయిందో ఆమె. గేటు నుండి వస్తూ పోతూన్న ఖైదీల ముఖాలను పోల్చుకుంటూ తనకోసం ఎంత వెతికాయో ఆ కళ్ళు - తన అవసాన దశలో తన కడుపుపంటను ఆఖరి సారిగా చూసి పోవటానికొచ్చిన ఆ కళ్ళు తనకోసం ఎంత నిరీక్షించాయో... తన కొడుకు ఈ జైల్లో లేడని నిర్ధాక్షిణ్యంగా జైలర్ పంపినప్పుడు, ఎంత నీరసంగా ఆ కాళ్ళు వెనక్కితిరిగి వెళ్ళి పొయ్యాయో"... ఎన్నో అనుభూతులతో, జ్ఞాపకాలతో హృదయం స్పందించసాగింది. కానీ బొటబొటా కన్నీరు కార్చలేదు. అవి ఏనాడో ఇంకిపొయ్యాయి.

అతని తల్లి మరణవార్త విన్న డిటెన్యూలు ఒక్కొక్కరే ఆ డైనింగ్ హాలు వద్దకు రాసాగారు.

"మీ తల్లి గారు పోయారంట... పాపం... ఏమైనా జబ్బా...?"

"ముసలమ్మ లెండి... పండుటాకులాగానే రాలిపోయింది...." క్లుప్తమైన సమాధానం, తడిఆరిపోయిన గొంతుతో.

"ఈ ఉత్తరం చూపెట్టి 'టెంపరరీ రిలీజ్'-కొరకు అప్లయి చెయ్యి. కనీసం దినానికయినా చేరుకో..."

"అసలు మనిషి పోయినాంక ఈ దినాలూ, పిండాకూళ్ళూ దేనికి?... మనిషి సచ్చిపోయినమాట నిజమైనా, పోలీసోళ్ళు 'నిజమ'ని రాసేదాకా గవర్నమెంటూ నమ్మదు. అదొక ఒడిసిపోని కత.... అందుకనే ఇడిసిపెట్టేదాకా నేనేపైరవీ సెయ్యదలుచుకోలేదు...." నిశ్చలమైన జవాబు.

ఆ మాటల్లో సూర్యకాంతినీ, చీకటినీ, సమదృష్టితో చూసే గంభీరత.

ఆశించిన ఆశయం కోసం, అన్ని కష్టాలూ పడే ధీరోదాత్తత.

ఇంటికి వెళ్ళాలన్న ఆరాటం లేదు. తన వాళ్ళకు ఉత్తరం వ్రాయాలన్న ఉత్సాహం లేదు. అయినవాళ్ళను ఇంటర్వ్యూకి పిలిపించుకోవాలన్న తపన లేదు.

హిమాలయాల్లాగ అచంచలమైన వ్యక్తిత్వం.

జైలంతా శూన్యంగా, బోసిబోసిగా ఉంది. సంధ్యకాంతులు అంతరించి పూర్తిగా చీకటి ఆవహించింది. నల్లని ఆకాశంలో మిణుకుమిణుకుమంటున్నాయి - శతకోటి నక్షత్రాలు - ఉరితీయబడిన అమరవీరుల శిరస్సుల్లా. కత్తిరించి పారేసిన చిటికెనవ్రేలు గోరులా- పాలిపోయిన చంద్రుడు తూర్పువైపు సెంట్రీగోపురంపై నిలబడ్డాడు. శవాన్ని పారవేసి వచ్చిన బంధువుల్లా వెంకన్న చుట్టూ మౌనంగా నిలబడ్డారు డిటెన్యూలు.

ఏకాకితనం నిండిన జైలు-మానవుల మధ్య నిర్మానుషత్వం నిండిన జైలు. 'నిన్న'కు-'నేడు'కు-'రేపు'కు వ్యత్యాసంలేని జైలు.

సేకరణ : "యువ" మాసపత్రిక, మార్చి-1982